## క్లుప్తంగా

### కళ్లం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులతోపాటు అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడు కృషి చేస్తోందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.వంశీకృష్ణకు విట్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. అడ్వాన్స్‌డ్ ఐపీడీఎస్ ఫార్మ్‌వర్క్స్ ఫర్ ఎన్‌హేసింగ్ సొసైటీ అండ్ కమ్యూనికేషన్ ఇన్ హాస్టల్ వీనెట్స్ అనే అంశంపై విశ్వవిద్యాలయం డాక్టర్ కె.గణేష్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని చెప్పారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్ అభినందించారు.

### గుంటూరు రీజినల్ విజిలెన్స్ సీఐగా చంద్రశేఖర్



నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా కొమ్మాలపాటి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న సీఐ ఎ.శ్రీహరిరావును ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు.

### అర్చక సేవా సంఘం రూ.లక్ష విరాళం



గుంటూరు మెడికల్: తుఫాను, వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు సాయం చేసేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కి అర్చక సేవా సంఘం పల్నాడు జిల్లా నేతలు రూ.లక్ష విరాళంగా అందజేశారు. మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, అర్చక సేవా సంఘం పల్నాడు అధ్యక్షుడు చిట్యాల మల్లికార్జున శర్మ, నాయకులు చెంగోలం శేషాచార్యులు, వడ్డమాను రమణ చార్యులు పాల్గొన్నారు.

### వినికిడి సమస్యలకు చెక్ పెట్టవచ్చు



గుంటూరు మెడికల్: చిన్నారుల్లో వినికిడి సమస్యలకు చెక్ పెట్టేందుకు ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్నామని ఆర్బీఎస్‌కే స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. జిల్లాలో వినికిడి లోపం ఉన్న పిల్లలకు వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమం స్వరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు ఏపీ ఎన్జీవో కళ్యాణ మండపంలో నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 150 మంది వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు సుమారు రూ.కోటి విలువ చేసే వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో స్వరూప ట్రస్ట్ ప్రతినిధి సురేష్ పిళ్లై, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కీర్తి, ఆడియాలజిస్ట్ శ్రీనవ్య, శిరీష, ఆర్‌బీఎస్‌కే బృందం పాల్గొన్నారు.

### ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ విద్యార్థులతో కలసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ఓబీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారంలో మూడు గంటలు కేటాయించుకుని తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యుడు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఐజాక్‌ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సందీప్ కుమార్ పాల్గొన్నారు.

### యువతి మెడలో గొలుసు చోరీ

లక్ష్మీపురం: వాకింగ్ చేసుకుని తల్లి, కూతురు తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి కుతూరు మెడలో రెండు సవర్ల బంగారు చైన్ లాక్కొని పరారైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. విద్యానగర్ 3వ లైన్‌కు చెందిన తల్లి, కూతురు వాకింగ్ పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి పయనం అయ్యారు. అదే సమయంలో ఇద్దరు యువకులు స్కూటీ ద్విచక్ర వాహనంపై వచ్చి కుమార్తె మెడలో ఉన్న 2సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారైయ్యారు. దీంతో బాధితులు తక్షణమే డయల్ 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాలను, పరిసర ప్రాంతాల్లో ఉన్న వారిని విచారించారు. అయితే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వాల్సి ఉంది.

## • దసరా సందడి

ఆర్టీసీ బస్టాండ్‌లో దసరా సందడి కనిపిస్తోంది. బుధవారం గాంధీ జయంతి సెలవు కావడం, తరువాత పాఠశాలలు, కాలేజీలకు దసరా సెలవులు కావడంతో దూరప్రాంతాల విద్యార్థులు బయలుదేరి ఇళ్లకు వెళ్తున్నారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థులు కుటుంబ సభ్యులతో సొంత ఊర్లకు మంగళవారం వెళ్తున్న దృశ్యాలు.

–సాక్షి ఫొటో గ్రాఫర్, గుంటూరు








## ‘స్వచ్ఛ గుంటూరు’లో భాగస్వాములు కావాలి

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు సాధనలో గుంటూరు నగరంలోని వివిధ వర్గాల ప్రజలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వాములు అవుతున్నారని, సమష్టి కృషితో స్వచ్ఛ గుంటూరు అతి త్వరలో సాకారంకానుందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక టీజేపీఎస్ కళాశాల ఆడిటోరియంలో నగరంలోని అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో వ్యర్థాల నిర్వహణపై అవగాహన శిబిరం అనంతరం చేపట్టిన స్వచ్ఛత హి సేవ మానవహారంలో నగర కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతి ఒక్కరి నినాదం కావాలని, తమ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రం బాధ్యతగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమ వద్దకు వచ్చే పిల్లలకు స్వచ్ఛతపై ప్రత్యేక అవగాహన కలిగించడం ద్వారా భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు కృష్ణవేణి, శ్రీవాణి, చంద్రకళ, ఐటీసీ బంగారు భవిష్యత్, ఫినిష్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, కళాశాల సెక్రెటరీ బ్రహ్మం పాల్గొన్నారు.

**వ్యర్థాల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండాలి**

వ్యర్థాల నిర్వహణ అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని, నాయుడుపేట డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను మార్చి 31, 2025 నాటికి పూర్తి స్థాయిలో క్లియర్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నాయుడుపేటలోని లెగసీ వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ తొలుత యార్డులోని ప్రస్తుతం ఉన్న వ్యర్థాలు, ట్రీట్మెంట్ జరుగుతున్న తీరు, యంత్రాల పని తీరును నేరుగా పరిశీలించి, మాట్లాడుతూ గతంలో వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేయడం జరగేదని, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు బహిరంగంగా వ్యర్థాలను ఉంచరాదన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పొన్నూరు రోడ్ డంపింగ్ యార్డులోని వ్యర్థాలను నాయుడుపేటలోని డంపింగ్ యార్డు టెండర్ పొందిన తరుణ్ అసోసియేట్స్ వారు నిర్దేశిత ప్రమాణాల మేరకు 2025 మార్చి 31 నాటికి పూర్తి స్థాయిలో ట్రీట్మెంట్ చేయాలన్నారు.

**నేడు స్వచ్ఛత సేవ ముగింపు కార్యక్రమం**

స్వచ్ఛత హి సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించనున్న సామూహిక పరిసరాల పరిశుభ్రత కార్యక్రమ ఏర్పాట్లను కమిషనర్ పులి శ్రీనివాసులు సమీక్షించారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, ఉమెన్స్ కాలేజీని సందర్శించారు.

## సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: సైన్స్ ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నగర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మణ రావు మాట్లాడుతూ ప్రస్తుతం మనం వినియోగించే ప్రతి వస్తువు శాస్త్రవేత్తల కృషి వలన వచ్చినవేనని, సమాజాభివృద్ధిలో సైన్స్, శాస్త్రవేత్తల పాత్ర కీలకమైనదని అన్నారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. శ్రీవర్ధని కళాశాల డైరెక్టర్ గ్రంధి స్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని కలిగించే ఇటువంటి కార్యక్రమాలను జనవిజ్ఞానవేదిక నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 70 టీంలు పాల్గొనగా, వాటిలో ప్రైవేటు పాఠశాలల విభాగంలో కాటూరి, కొండవీడు, విజేత పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చేబ్రోలు-మహాలక్ష్మి పుల్లయ్య, జలగం రామారావు, కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలు వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు బి.ప్రసాద్, జి.వెంకటరావు, టీఆర్ రమేష్, ఇ.అనిల్‌కుమార్, బి.శంకర్‌సింగ్ పాల్గొన్నారు.

### పొగాకు బోర్డు కార్యాలయంలో ‘స్వచ్ఛతా హి సేవ’ కార్యక్రమం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జీటీ రోడ్‌లోని భారత పొగాకు బోర్డు రైతు భవన్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ‘స్వచ్ఛతా హి సేవ-2024’ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ‘స్వచ్ఛతా హి సేవ’ కార్యక్రమంలో ‘స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత’ అన్న మహాత్మా గాంధీ నినాదంతో పొగాకు బోర్డు రైతు భవన్‌లో ‘ఏక్ పెడ్ మాకే నామ్’ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నోడల్ అధికారి జి.దామోదర్ తెలిపారు. అనంతరం మొక్కలు నాటి మొక్కల వల్ల వాతావరణం, భావితరాలకు జరిగే లాభాల గురించి వివరించారు.

## తత్వశాస్త్ర అధ్యయనంతో పాటు అనుసరణ అవసరం

ఏఎన్‌యూ: నేటి ఆధునిక జీవన శైలిలో తత్వశాస్త్రాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయడంతో పాటు అనుసరించడం ఎంతో అవసరమని అనుసరణకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పలువురు తత్వవేత్తలు, వక్తలు అభిప్రాయపడ్డారు. తత్వవేత్త, యూజీసీ మాజీ వైస్ చైర్మన్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కొత్త సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ ఆధ్వర్యంలో ‘పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తీస్ విజన్ ఆన్ ఫిలాసఫీ అఫ్ ఎడ్యుకేషన్: రిఫ్లెక్షన్స్ ఆన్ 21 సెంచరీ ఎడ్యుకేషన్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా’ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. తత్వవేత్త ప్రొఫెసర్ నారాయణ చక్రవర్తి మాట్లాడుతూ కేవలం సదస్సుల ద్వారా తత్వశాస్త్రాన్ని బోధించలేమని తత్వశాస్త్రాన్ని కలిగి ఉండాలంటే విభిన్న రకాల బోధనా పద్ధతులను అనుసరించాలన్నారు. ప్రొఫెసర్ తారీఖ్ ఇస్లామ్, ప్రొఫెసర్ అశోక్ వోహ్రా మాట్లాడారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తి రావు నివేదిక సమర్పించారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జార్జి విక్టర్, ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జి.కొండలరావు, అధ్యాపకులు కె.రమేష్, సి.వెంకటాచలం, వై.అశోక్ కుమార్, దివ్యతేజోమూర్తి, సోమశేఖర్, సీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో...

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో మంగళవారం ‘స్వచ్ఛతా హి సేవ’ కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీలోని అకడమిక్ భవనం ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో చైర్ ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, డాక్టర్ కె. అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలో సభ్యత నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా సభ్యత్వ పరిశీలకులు పాలపాటి రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సీహెచ్ తిరుపతిరావు, చరక కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు భగవాన్ దాస్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ మద్యం షాపులు మూసివేత

నెహ్రూనగర్: ప్రభుత్వ మద్యం షాపులు మంగళవారం మూతపడ్డాయి. గుంటూరు జిల్లాలో 120 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో సూపర్‌వైజర్లు 120 మంది, సేల్స్‌మెన్స్ 318, నైట్ వాచ్‌మెన్‌లు 120 మంది చొప్పున మొత్తం 558 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి ఉద్యోగాలు కొనసాగింపుగా ప్రభుత్వం ఎటువంటి స్పందన రాకపోవడంతో మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది మంగళవారం విధులు బహిష్కరించారు. మధ్యాహ్నం 3గంటల వరకు షాపులు తెరవకపోవడంతో అధికారులు హడావుడి చేసి వారితో షాపులు తీయించారు. మంగళవారం మద్యం దుకాణాలు తీయకపోవడంతో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి 5వ తేదీన చర్చలకు రావాలని పిలుపు వచ్చిందని, పరిష్కార దిశగా అడుగులు వేస్తామని హామీ ఇవ్వడంతో షాపులు తీయడం జరిగిందని ఏపీసీఓఈడబ్ల్యూ స్టేట్ సెక్రటరీ జె.కోటేశ్వరరావు ‘సాక్షి’కి తెలిపారు. 5వ తేదీన జరిగే చర్చల్లో మాకు ప్రత్యామ్నాయంగా ఉద్యోగ అవకాశాలు కల్పించని పక్షంలో ఆ రోజే షాపులు తెరవమని, విధులకు హాజరు కాబోమని స్పష్టం చేశారు.

### ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం



నెహ్రూనగర్: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంస్థ జీఎం సప్పరపు శ్రీధర్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ ఏర్పాటై 25 సంవత్సరాలైన సందర్భంగా నగరంలో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 24 సంవత్సరాల ప్రయాణంలో కమ్యూనికేషన్స్ ప్రపంచంలో గట్టి పోటీని ఎదుర్కొని, ఒడిదుడుకులు దాటి, కొత్త నైపుణ్యంతో, మరింత అనుభవంతో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. గత పది సంవత్సరాలుగా ఆప్టికల్ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం అందిస్తున్నామని వివరించారు. గుంటూరు బిజినెస్ ఏరీయా పరిధిలో 38 వేల బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంగా ముందకు సాగుతున్నామని వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు బిజినెస్ ఏరియాలో 4జీ సర్వీస్ తీసుకొస్తున్నట్లు తెలిపారు.

## వివిధ పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలు



శ్రీపూజిత స్కూల్లో విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మావతి



భాష్యం బ్లూమ్స్‌లో అమ్మవారి ప్రతిమ, తొమ్మిది అలంకారాలతో కూడిన చిత్రాల వద్ద చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూలులో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ దసరా మన తెలుగువారికి పెద్ద పండుగ అని, సంస్కృతి, సంప్రదాయాలకు నిండుగా కనిపించే పండుగ అని అన్నారు.

**భాష్యం బ్లూమ్స్‌లో ముందస్తు దసరా వేడుకలు**

గుంటూరు ఎడ్యుకేషన్: రింగ్‌రోడ్డులోని భాష్యం బ్లూమ్స్‌లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారి ప్రతిమతో పాటు తొమ్మిది రోజులపాటు ధరించే అవతారాతో కూడిన చిత్రపటాలను ఉంచి అమ్మవారికి పూజ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలపై సరైన దృక్పథాన్ని కలిగించాలని అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా దసరా పండుగను ప్రతి ఇంట్లో జరుపుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

## హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ కీలకం

**ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి**




మాట్లాడుతున్న స్వరూపరాణి

ఏఎన్‌యూ: హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో కీలకమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి అన్నారు. ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ‘ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్’ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు ఆచార్య స్వరూపరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె ప్రసంగిస్తూ రోగులతో, వైద్య రంగ నిపుణులతో సంభాషించడానికి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ నిపుణులకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రస్తుతం ఈ కోర్సు చదివిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ ప్రసంగిస్తూ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కి కమ్యూనికేషన్ స్కిల్స్ అత్యవసరమని కమ్యూనికేషన్‌లో కీలక అంశాలైన వినడం, రాయడం, చదవడం, పరిపూర్ణంగా భావ వ్యక్తీకరణ చేయడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు సబ్జెక్టులకు సంబంధించిన అంశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నైపుణ్యం ఉంటేనే హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో రాణించగలుగుతారన్నారు. విభాగాధిపతి డాక్టర్ బి నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## హోప్ విన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ షమసుల్తానా

గుంటూరు మెడికల్: హోప్ విన్ హాస్పిటల్స్ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితిల సంయుక్త ఆధ్వర్యంలో పాత గుంటూరు క్రిస్టియన్ పేటలోని కింగ్ డమ్ చర్చిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ హాస్పిటల్స్ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో హోప్ విన్ హాస్పిటల్స్ కేవలం రూ.10లకు ఓపీని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి పేషెంట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, అన్ని రకాల హెల్త్ ఇన్సూరెన్స్‌లు తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కింగ్ డమ్ చర్చి పాస్టర్ రెవరెండ్ డీఎస్ సీ ఫిన్నీ, హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వరద బాధితులకు రూ.25 వేల విరాళం



ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, వనమా నరేంద్రకు చెక్కు అందజేస్తున్న రాఘవరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల, డిగ్రీ కళాశాల సంయుక్తంగా విజయవాడలోని వరద బాధితుల కోసం సేకరించిన రూ.25 వేలను సీఎంఆర్ఎఫ్ పేరిట చెక్కు రూపంలో తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు అందజేశారు. మంగళవారం సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపూజీ కమిటీ దాతృత్వంతో ఇచ్చిన ఈ మొత్తం సర్వం కోల్పోయిన బాధితులకు ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపూజీ కమిటీ ఉపాధ్యక్షుడు కర్పూరపు సూర్యనారాయణ, డిగ్రీ కళాశాల అధ్యక్షుడు పి.రాఘవరావు, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, ఏపీ రమాదేవి, సుభద్ర, అరుణ కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ.శ్రీధర్, ఆర్యవైశ్య నాయకుడు కె.సత్యం పాల్గొన్నారు.

## రేపటి నుంచి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రులు

నగరంపాలెం: సంగడిగుంట రెడ్లబజార్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో గురువారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థానం ఆవరణలో శరన్నవరాత్రుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులు అమ్మవారిని ప్రత్యేక అలంకరాలతో అలంకరిస్తామని అన్నారు. సమావేశంలో కార్యదర్శి మోరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మల్లం సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అరవ ఆంజనేయులు కార్యవర్గ సభ్యులు శ్రీపత్రి అప్పారావు పాల్గొన్నారు.

**శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..**

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో గురువారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య తెలిపారు. మంగళవారం రాత్రి దేవాలయం ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26వ దేవీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి పన్నెండు వరకు ప్రతిరోజు విశేష పూజలు, పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. విశిష్టమైన కార్యక్రమాలు, భజనలు ఉంటా యని చెప్పారు. సమావేశంలో బొల్లేపల్లి సత్యనారాయణ, వూటుకూరి నాగేశ్వరరావు, పుట్ట ప్రభాకర్ రావు, ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి మాట్లాడారు. అనంతరం మహోత్సవాల బ్రోచర్‌ను విడుదల చేశారు.

## విశాఖ ఉక్కు పరిరక్షణ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

లక్ష్మీపురం: జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల రిలే నిరాహార దీక్ష మంగళవారం ప్రారంభించారు. దీక్షను మొదటి రోజు నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ దండలు వేసి దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నాసర్ జీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధక్షులు జె.చైతన్య, పీడీఎస్‌యూ నాయకురాలు మానస ప్రసంగించారు.

## రైల్వే ఉద్యోగుల రక్తదానం అభినందనీయం

**డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ**



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: రైల్వేశాఖలో పనిచేస్తున్న వందమంది ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఆర్ఎం ప్రారంభి మాట్లాడుతూ స్వచ్ఛందంగా వంద మంది రైల్వే ఉద్యోగులు ముందుకు వచ్చి మొదటిసారిగా రక్తదానం చేయటం ఆనందంగా ఉందన్నారు. పేద రోగులకు వైద్యం అందిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు వంద యూనిట్ల రక్తాన్ని అందించడం ద్వారా అత్యవసర వైద్య సేవలకు తోడ్పడుతుందన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు ముందుకు వచ్చి రక్తం దానం చేసిన వారిందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడారు. అనంతరం రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్ కుమార్, మానవత చైర్మన్ పావులూరి రమేష్, సీనియర్ డీపీఓ హనూర్, మానవత బ్లడ్ డొనేషన్ కమిటీ చైర్మన్ పి.గురవారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.సుధాకర్ రావు, మానవత డైరెక్టర్స్ నల్లబోతు సాంబశివరావు, డాక్టర్ కల్పన, రమణ, డాక్టర్ సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

## పెన్షనర్ల డిమాండ్‌లను నెరవేర్చాలి



నినాదాలు చేస్తున్న సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం

లక్ష్మీపురం: పెన్షనర్లకు సంబంధించిన అన్నీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) శాఖకు చెందిన రాష్ట్ర పెన్షనర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇంటర్నేషనల్ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం గార్డెన్ సెంటర్‌లోని అన్నమయ్య భవన్‌లో సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్లు సమావేశమయ్యారు. పలు డిమాండ్లతో కూడిన పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్ మాట్లాడుతూ పెన్షనర్లు మూకుమ్మడిగా తమ డిమాండ్లను ఆమోదించాలని నినాదాలు చేశారు. జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రిటైర్మెంట్ ప్రయోజనాల బ్యాంక్ వడ్డీలపై ఇన్ కమ్ టాక్స్ ఉండరాదని తెలిపారు. సీనియర్ సిటిజన్ రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్‌లతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ ఈసీ సభ్యులు రాజేశ్వరరావు, పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, కె.సామ్రాజ్యం పాల్గొన్నారు.